చట్నీ కోసం ప్రతిపూట శివాలయం నుంచి వేణు గోపాలస్వామి గుడిదాకా తిరిగి కొబ్బరి చిప్పలు పట్టుకొచ్చి కల్తీలేని కొబ్బరి పచ్చడి చేస్తారు.

కారప్పొడి అనే పదానికి అర్థం అక్కడే తెలుసుకోవాలి. సెనగపప్పు, మినపపప్పు వేయించి ధనియాలు, కరివేపాకు వేరే వేరేగా వేయించి, అదీ ఇదీ వేరే వేరే చిన్న చూర్ణంగా చితక్కొట్టి అప్పుడారెండూ కలుపుతారు. కారప్పొడి మునిగిపోయేటంత నెయ్యి విధిగా వడ్డిస్తారు, ఇడ్లీమీద.

పొట్టు పెసలు నానేసి రుబ్బి ఆ పిండితో వేస్తారు పెసరట్టు. ఎగ్స్ట్రా ఛార్జీ లేకుండానే అల్లం, ఉల్లి, పచ్చిమిర్చి,జీలకర్ర వేస్తారు. అట్టు పలచనా ఆవరోధాలు దట్టం కాకుండా పెసరట్టు కూడా తగినంత దళసరిగా వేస్తారు. ఉప్మా అసలు బొంబాయి రవ్వతో చేసే పద్దతే లేదు. గోధుమలు ఆడించిన రవ్వతో చేయవలసిందే. లేకపోతే అసలు సయ్యాగారికే నచ్చదు.

పీకల్దాకా తినీ కూడా బాలాజీరావు "పద, అక్కడికి వెళ్లి టిఫిన్ చేద్దాం" అన్నాడు.

నేను నవ్వి అసలు సంగతి చెప్పేను. "సయ్యాగారు దివాలా తీసి ఆ ఇల్లు అమ్ముకుని ఎటో వెళిపోయాడు, ఆరు నెలలయిపోయింది."

★

## 19. కసిగా ఉందీ, కసికసిగా ఉందీ!

మొన్న ఆదివారంనాడు నాగభూషణం గారింటికి వెళ్తే అక్కడ కమలాకరరావు అనే ఒక యువకుణ్ణి పరిచయం చేశారాయన. నేను వెళ్ళే సరికి అతను నాగభూషణం గారితో తీవ్రంగా అంటున్నాడు. "మీరు తుపాకీ ఇవ్వనంత మాత్రంచేత నా పగ చల్లారిపోతుందను కోకండి! ఆ మూర్తిరాజు గాణ్ణి కత్తితో పొడిచి అయినా సరే అంతం చేసి తీరుతాను. అప్పటికి గానీ నా కసి తీరదు!" ఆ మాటలు పూర్తిచేసే సరికి నేను చేరాను అక్కడ. నాగభూషణం గారు అతన్ని నాకు పరిచయం చేసిన మరుక్షణం అతగాడు "కనీసం నా ప్రయత్నం నెరవేరాలని దీవించి పంపండి." అని నిష్క్రమించాడు.

"ఏమిటి సంగతి?" అన్నాను.

నాగభూషణం గారు నిట్టూర్చాడు. "అదో పెద్దకథ...!"

"చెప్పేండి, మీకూ కాస్త సుళువుగా వుంటుంది."

"ఇతనిది వల్లభాపురం. జి.ఎస్. కంపెనీ ఎం.డి. మూర్తిరాజు గార్నెరుగుదురు కదా. అతనిదీ ఆ వూరే. వీళ్ల నాన్నగారు ఇతను పుట్టిన పన్నెండేళ్లకే పోయారు. ఆ తరువాత మూర్తిరాజు గారు తన చెల్లెలి పెళ్లి విషయంలో కొన్ని గృహకృత్యాలకు వీళ్ళమ్మగారి సహాయం తీసుకున్నారట. అప్పుడో, ఆ తరువాతనో మూర్తిరాజు గారు ఆవిడని రేప్ చెయ్యబోయారని, ఆ అవమానం భరించలేక ఆవిడ ఆత్మహత్య చేసుకుందని నిన్నరాత్రి ఏవో పాత కాగితాలు తిరగేస్తూ ఉంటే తెలిసిందట. అందుకని ఈ ఇరవై రెండేళ్ళ తరువాతా మూర్తిరాజు గార్ని చంపేస్తానని ప్రతిజ్ఞ చేసి నా తుపాకీ అడగడానికి వచ్చేడు. అలాటి పనులకు తుపాకీ ఎరువియ్యకూడదు బాబూ

అంటే వినడు. తను ఈ రాత్రి ఆ హత్య చేస్తాడట. సాయంకాలం ఐదు గంటలకి నా తుపాకీ ఎవరో దొంగిలించేరని పోలీసు రిపోర్టు ఇస్తే ఇంక ఆ నేరంలో అతను పట్టుబడి పోయినా నా ప్రమేయం ఉండదని అతని వాదన.

"ఇరవై రెండేళ్ళ తరువాత ఇప్పుడు కసి తీర్చుకోవడం దేనికట-?" అన్నాను.

"ఏమో. రోజు రోజుకీ ఈ కసి తీర్చుకునే లక్షణం మనవాళ్లు చాలామందికి పట్టు కుంటోంది. నిన్న సాయంకాలం అనిరుద్ధం ఫోన్ చేసేడు. తను డ్రామారావు మీద త్వరలో కసి తీర్చుకోగలడట. ఆరేళ్ళ కిందట డ్రామారావు వెలుగుదేశం అనే పార్టీ పెట్టి అనిరుద్ధాన్ని అందులో చేర్చుకున్నాసరే, ఆ ఆరేళ్లనుంచీ ఇతను నోరు మెదపకుండా కేవలం ఆర్డర్సు అమలుపరిచే కట్టుబానిసగా చూసేడట, అందుకని పార్టీకి, పదవికి రాజీనామా చేసి వెలుగునాడు అని ఒక కొత్త పార్టీ పెట్టి డ్రామారావు మీద కసి తీర్చుకుంటాట్ట" అని నాగభూషణంగారు చెప్పేసరికి అనిరుద్ధం గారి కొత్తపార్టీ పేరు తెలిసినందువల్ల సరదా వేసింది నాకు.

"బావుంది, బావుంది!" అని నవ్వాను నిజంగానే.

"ఆ వజ్రకుమారి గారు చూడండి! ఆవిడ భర్త గాంధీ గారంతటి నాయకుడని నమ్మిందట. అతన్ని ఎవరో హత్యచేసేరు కదా. ఆ హత్య చేసిన వాళ్లమీద కసి తీర్చుకోడానికి రాజకీయాల్లో చేరుతానని అతని చితిమీద ప్రమాణం చేసిందట. అమ్మా, మీరు అలా మాట్లాడకూడదు. రాజకీయాల్లో చేరే వాళ్లు దేశ సేవ చేసే ఉద్దేశంతోనే చేరుతున్నాం అని చెప్పడం మన ఆచారం, అని నచ్చజెప్పినా సరే వార్తాపత్రికలన్నింటికీ అలాగే స్టేట్మెంట్ ఇచ్చేసింది" అని బాధపడసాగారు నాగభూషణంగారు.

"మీకు సాహిత్యం గురించి అట్టే తెలీదుగానీ, ఓసారి కొడవటిగంటి కుటుంబరావుగారు-"

"ఏమన్నారు?"

"భారతీయ సాహిత్యం సెక్స్ అనేది లేకుండా చాలా శతాబ్దాలు గడిపేసిందట. దానివల్ల జన జీవనంలో సెక్స్ ఒక నిషేధ వస్తువుగా ఉండిపోయిందిట. స్వాతంత్ర్యం రాగానే సాహిత్యం లోనూ జన జీవనంలోనూ సెక్స్ విపరీతం అయిపోయి కసి తీర్చుకోడం మొదలెట్టిందట." అని చెప్పేను.

"చాలా కరెక్టుగా చెప్పేరాయన" అని నాగభూషణం గారు చప్పట్లు కొట్టేరు.

"ఇది విన్నారా? ఆ మధ్య ఒక బహురాష్ట్ర సారా కాంట్రాక్టరు మన రాష్ట్రంలో ఒక ఎక్సయిజు అధికారికి మిఠాయి ప్యాకెట్లో పెట్టి లంచం ఇవ్వబోతే ఆయన ఆ కాంట్రాక్టర్ని పోలీసులకి అప్పగించాడట. ఆ కసి తీరడానికి ఆ సారా కాంట్రాక్టరు తనకి తెలిసిన మరో పెద్ద మనిషిచేత ఒక "పసుపుపచ్చ" పత్రిక పెట్టించి అందులో ఈ అధికారిమీద ఎడిటోరియల్సు, సెంటరుస్ప్రెడ్ రిపోర్టులూ రాయించేస్తున్నాడట" అని చెప్పేను.

"ఇదుగో ఆ పత్రిక నా దగ్గర ఒక కాపీ ఉంది" అని టేబిలు సొరుగులోంచి తీసి చూపించేరు నాగభూషణంగారు.

ఇంతలో ఒకావిడ మేం ఉన్న గదిలోకి వచ్చింది, ఎడం చేత్తో పదేళ్ల కుర్రాడిని జెబ్బ పట్టుకుని లాక్కొస్తూ "బాబుగారూ, మీకిదేమైనా న్యాయమేనా?" అంది, నాగభూషణం గారితో, ఖాళీగా ఉన్న చేత్తో కళ్లు వొత్తుకుంటూ.

"ఏమిటి, ఏమిటి, ఏం జరిగింది?" అని నాగభూషణం గారు కంగారుపడ్డారు.

"మీ అబ్బాయి రవి చూడండి, వీణ్ణి వీపుమీద ఎలా కొట్టేడో! పిల్లలన్న తరవాత కాస్త కాస్త కొట్టుకోడం తప్పదనుకోండి. కాని ఇంతలాగ తట్టుతేరేటట్టు కొట్టేడమేనా? ఇదేమైనా న్యాయమా అని అడుగుతున్నాను!" అంది ఆవిడ, కుర్రాడి వీపును ప్రదర్శిస్తూ.

నిజంగానే పెద్ద తట్టు తేరి ఉంది, అక్కడ.

నాగభూషణంగారు మారు మాట్లాడక లోపలికి వెళ్ళి వాళ్ల ఆఖరబ్బాయి రవిని చెవి పట్టుకొని ఈడ్చుకొచ్చారు.

"చూసేవా, నువ్వు చేసిన పని! అసలు ఎవ్వర్నీ కొట్టకూడదని చెప్పేను కదా! వాణ్ణి ఎందుకు కొట్టావు?" అని కుర్రాణ్ణి నిలదీశారు.

"వాడు నన్ను తిట్టేడండి" అన్నాడు రవి.

"తిడితే నువ్వూ తిట్టాలిగాని అలా కొట్టుకుంటార్రా?"

"నేనూ తిడుదును, కాని వాడికి చెముడు కదా, నేను తిడితే ఎఫెక్టు ఉండదని-"

నాగభూషణంగారు "పో!" అని కొడుకుమీద ఉరిమి; ఒచ్చినావిడికి సారీ చెప్పి ఒక ఆయింట్‌మెంట్ ట్యూబు ఇచ్చి పంపేశారు.

"కసి తీర్చుకోడం అనేది మానవుల్లో జంతు ప్రవృత్తికి నిదర్శనంగా మనం కొట్టిపారేసినా అది మానవుల మౌలిక లక్షణాల్లో ఒకటి అనే సంగతి మనం మరిచిపోకూడదు. మయసభలో ద్రౌపది దుర్యోధనుణ్ణి చూసి నవ్వినందుకు కదా, దుర్యోధనుడు కసి తీర్చుకోడానికి మహాభారతం అంతా అలా నడిపించాడు!" అన్నాను నేను.

నాగభూషణం గారు ఒప్పుకోలేదు. "ఒక చెంప కొడితే రెండో చెంప వొప్పగించమన్న మాటని ఆచరించి చూపించిన మహాత్మాగాంధీగారు పుట్టిన దేశం ఇది" అని అహింస, క్షమాగుణం, సర్వమానవ సౌభ్రాతృత్వం ఇలాంటి విషయాలమీద ఉపన్యాసం ఇవ్వడానికి తయరైపోయారు. ఉపన్యాసం వినకుండా నేను జారుకుంటానేమో అని ఇంట్లోకి వంగి చూసి నాకోసం టిఫినూ, కాఫీ ఏర్పాటు చేసేరు. వేళగాని వేళప్పుడు గెస్టులని పీకలమీదికి తీసుకొస్తున్నారన్న కసితో వాళ్లావిడ ఉప్మాలో ఉప్పు, కాఫీలో పంచదార ఎక్కువ వేసేసి ఆయనమీద కసి నామీద తీర్చుకుంది.

అదంతా ఐపోయి ఇంటికొచ్చేసరికి మా ఆవిడ అంది - "సరోజిని గారు మనల్ని ఆవిడ సంగీత కచ్చేరికి తీసికెళ్లి వారం రోజులు అయిపోయింది కదా. మనం కూడా ఆవిడకి ఏదో చెయ్యాలండి. లేకపోతే నాకు శాంతిగా ఉండదు."

"ఏముంది? ఆవిణ్ణి ఓ పూట మనింటికి భోజనానికి రమ్మంటే సరి, తీరిపోతుంది!" అని మా ఆవిణ్ణి సముదాయించేను.

★